పరామర్శ

మెట్టుగూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాపోలు సురేష్ కుమారుడు రాహుల్ ఆకస్మికంగా మృతిచెందడంతో మంగళవారం ఆయన భౌతికకాయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత రమేష్, యువనేత రామేశ్వర్ గౌడ్‌లు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
– అడ్డగుట్ట, జూన్ 18

సహారా ఆధ్వర్యంలో
ఉచిత శిక్షణ

గోల్నాక, జూన్ 18 : స్వచ్ఛంద సేవా సంస్థ సహారా ఆధ్వర్యంలో పలు రంగాల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సేవా సంస్థ డైరెక్టర్ రాధిక తెలిపారు. టైలరింగ్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్యూటీషియన్ కోర్సుల్లో 22వ తేదీ నుంచి రెండో బ్యాచ్ ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు ఆయా రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు. వివరాలకు అంబర్ పేట తిరుమల నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో గానీ 94404 83089 నంబర్లో సంప్రదించాలని ఆమె కోరారు.

ప్రాధాన్యత ఇవ్వాలి

రామంతాపూర్,జూన్ 18 : మెట్రో ఉద్యోగాల్లో 30 శాతం స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే బండా రి లక్ష్మారెడ్డి మంగళవారం మెట్రో ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డిని బేగంపేట మెట్రోభవన్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి

రెవెన్యూ అధికారులతో నిర్వహించిన
సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

సిటీబ్యూరో/మారేడ్‌పల్లి, జూన్ 18: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్కారు ప్రవేశపెడుతున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకం కంటోన్మెంట్‌లోని నిరుపేదలకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి వార్డులో మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లతో పాటు, కమ్యూనిటీ హాళ్ల భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, వాటిలోనే నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన వారికి కేటాయించే విధంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమీక్షలో తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌కుమార్, డీటీ పృథ్వీ, మారేడ్‌పల్లి తహసీల్దార్ పద్మ సుందరి, ఆర్ఐ మల్లేష్‌తో పాటు సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని జింఖానా విద్యుత్ శాఖ ఏఈ అర్చితారెడ్డితో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ భేటీ అయ్యారు. రెండు, మూడు వార్డులకు సంబంధించి విద్యుత్ సమస్యలపై చర్చించారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు నరేష్, రమేష్ పాల్గొన్నారు.

పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

శాంతిభద్రతల విషయంలో రాజీపడొద్దు

నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలపై పోలీసు అధికారులు రాజీ పడాల్సిన అవసరం లేదని పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. సమీక్షలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, బేగంపేట, కార్ఖానా, బోయిన్‌పల్లి, తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్‌లు రామయ్య, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. మంగళవారం పికెట్ సుబ్బారావు నగర్‌లో ప్రభుత్వ నిధులతో మంజూరైన బోర్‌వెల్ పనులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి మధుకర్, డి.బి దేవేందర్, బద్రినాథ్ యాదవ్, తేజ్ పాల్, వెంకటేష్, సదానంద్ గౌడ్, వెంకటేశ్వర్లు, సంజీవ్ ,సత్యనారాయణ, వినోద్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

మహేంద్రాహిల్స్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

కంటోన్మెంట్ ఐదో వార్డు మహేంద్రాహిల్స్ త్రిమూర్తి కాలనీలో గత కొన్ని నెలలుగా అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనుల జాప్యం గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

చిలకలగూడ పార్క్ అభివృద్ధికి కృషి

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 18 : చిలకలగూడ పార్కు నిర్వహణ బాధ్యతలు పకడ్బందీగా చేపట్టాలని, పార్కు అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందిస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. చిలకలగూడ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం టకారాబస్తీలోని పద్మారావు నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.... పార్కు అభివృద్ధికి కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. న్యాయవాదులు గురుమూర్తి, నాగేశ్వర్ రావులు సలహాదారులుగా, రవి అధ్యక్షుడిగా, శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శిగా ఏర్పడ్డ కమిటీకి సహకరించాలని కోరారు. నూతన కమిటీ ద్వారా పార్కు అభివృద్ధికి తమ పూర్తి మద్దతు ఉంటుందని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రవి, శ్రీనివాస్ గౌడ్, చంద్ర శేఖర్, రాములు, నరసింహారెడ్డి, శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మారావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న చిలకలగూడ పార్క్ నూతన కమిటీ సభ్యులు

లష్కర్ జిల్లా ఏర్పాటుకు కృషి

రాజ్యసభ సభ్యుడు,బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

సికింద్రాబాద్,జూన్ 18: లష్కర్ జిల్లా ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు,బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ హామీ ఇచ్చారు.మంగళవారం లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు కలిసి జిల్లా ఏర్పాటు విషయంలో బీజేపీ మద్దతు తెలపాలని కోరారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఈ విషయంలో పార్టీలో చర్చించి తగు విధంగా నిర్ణయం తీసుకుంటామని డాక్టర్ లక్ష్మణ్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బాలరాజ్ యాదవ్, బాబూ రావు, సునీల్ ముదిరాజ్, జగదీష్ గౌడ్, కృష్ణ ముదిరాజ్, రవీందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుకు సహకరించాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధన కమిటీ సభ్యులు

బోనాల నిధులకు ..
దరఖాస్తు చేసుకోవాలి

ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాలు

సికింద్రాబాద్,జూన్18: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వివిధ అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు బోనాలు నిధుల మంజురుకు వెంటనే దరఖాస్తులు చేసుకోవాని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు. ప్రతి సంవత్సరం బోనాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి దేవాలయాలకు అలంకరణ, ఇతరత్ర అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసే సంప్రదాయాన్ని పాటిస్తున్నదని పేర్కొన్నారు. గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకుల దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తారని,ఆలయం లెటర్ హెడ్ తో పాటు ఆలయం ఫొటో, ప్రెసిడెంట్/సెక్రటరీ ఆధార్ కార్డు జిరాక్స్, ఆలయం బ్యాంక్ అక్కౌంట్ వివరాలు, నిధుల వినియోగం వివరాలతో యుటిలైజేషన్ సర్టిఫికెట్, రెండు రెవిన్యూ స్టాంప్స్ అందజేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు కోరారు.

బస్తీ దవాఖాన సిబ్బందికి
జీతాలు చెల్లించాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ దవాఖాన ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్, జూన్ 18 : బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న సపోర్టింగ్ సిబ్బందికి జీతాలు పెంచాలని, పెండింగ్‌లలో ఉన్న జీతాలు చెల్లించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగుల కేడర్‌లో పరిగణించాలని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. బంజరాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిశామని తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజద్ అలీఖాన్, హైద్రాబాద్ ఇన్‌చార్జి సన్నిత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చెప్పిన సమస్యలకు మంత్రి సానుకూలంగా స్పందించారని, వెంటనే వైద్యశాఖ కమిషనర్‌కు ఫోన్‌చేసి తమ సమస్యలను పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో సోషల్ వర్కర్ సయ్యద్ ఆసిఫ్, అసోసియేషన్ నాయకులు కుషాల్, సుదర్శన్, మోయిన్, ఫహీమ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూన్ 18:అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్ 9లో గుర్తు తెలియని ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రయాణికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మల్కాజిగిరి, జూన్ 18: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో డీసీ రాజుకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేదలకు ఇప్పటికీ ఉచిత విద్యుత్, రేషన్ కార్డు, పింఛన్లు అందడం లేదన్నారు. దరఖాస్తులను మాయంచేసి తప్పించుకుంటున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. రానున్న పండుగలను పరగణలోకి తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీఎన్ వెంకటేష్, శ్రీనివాస్, ధనరాజ్, లక్ష్మణ్‌గౌడ్, విఠోబా, నవీన్, నాగరాజు, శ్రీకాంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో వంగపల్లి జన్మదిన వేడుకలు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఉస్మానియా యూనివర్సిటీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ విద్యార్థి నాయకుడు, దళిత దండోరా ఉద్యమ రథ సారథిగా వంగపల్లిని అభివర్ణించారు. మాదిగల ఆశాజ్యోతి, మాదిగ–మాదిగ ఉపకులాల హక్కులకై నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్న వంగపల్లి మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వరిగడ్డి చందు, విద్యార్థి నాయకులు నాగరాజు, నర్సాని రమేశ్, తాళ్ల అజయ్, తిరుమలేశ్, జీవన్, సురేశ్, శ్రీకాంత్, నగేశ్, బాబన్న, రఘు, కాల్తిక్, మణి పాల్గొన్నారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 18:

యూసుఫ్‌గూడకు 50 వేల మొక్కలు..

జూబ్లీహిల్స్,జూన్ 18 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పచ్చదనం పెంపునకు 50 వేల మొక్కలు కేటాయించినట్లు జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం లేకపోవడంతో సర్కిల్‌కు మొక్కల కేటాయింపు గణనీయంగా తగ్గింది. కాగా గతంలో నాటిన మొక్కలపై దృష్టి పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక పార్కుల్లో నర్సరీలు సైతం అందుబాటులో లేకపోవడంతో యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి మొక్కలు అవసరమైన చోటుకు తరలించనున్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి

హిమాయత్‌నగర్, జూన్ 18: బోనాల పండుగ నేపథ్యంలో ఆలయాల పరిసర ప్రాంతాలు, రోడ్లు శుభ్రంగా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహా లక్ష్మి కోరారు. ఈ మేరకు మంగళవారం చంద్రానగర్, ఓల్డ్ కమేలాబస్తీతో పాటు పలు ఆలయాలను ఆమె సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..డివిజన్‌లోని ఆలయాలకు బోనాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఐటీఎఫ్ జాతీయ పారా టోర్నీ మంగళవారం ఘనంగా ముగిసింది. బాలికల సబ్‌జూనియర్ అక్వాథ్లాన్ విభాగంలో తెలంగాణకు చెందిన జోహాన్న షిజు రజత పతకంతో మెరిసింది. మిగతా విభాగాల్లో దుర్విశ పవార్, సోరమ్, నెల్షి, తొకోచామ్ గౌతమ్, అథర్వ్ షాజి పాటిల్, స్నేహల్ జోషి, రోషన్ గోండ్ పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రయథ్లాన్ అధ్యక్షుడు మదన్‌మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్, ఆట ప్రతినిధి:



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుగూడ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన టోర్నీ ఫైనల్లో సాయ్ టీమ్ 41–35 తేడాతో నవశక్తి క్రీడామండల్‌పై విజయం సాధించింది. విజేత, రన్నరప్ జట్లకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్ ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీశ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాటక కళాకారులను ఆదుకోవాలి

తెలుగు యూనివర్సిటీ: నాటక కళా రంగానికి విశేషంగా సేవలందించిన కళాకారులను ఆదుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. సర్వకళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నాటక కళారంగానికి విశేషంగా కృషి చేసిన పలువురు నిపుణులకు ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. రమణాచారి, సంఘసేవకుడు సారిపల్లి కొండలరావు, లంక లక్ష్మీనారాయణ, నృత్య గురువు భారతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంక్షేమ వేదిక అధ్యక్షుడు అశోక్ పవార్, కార్యదర్శి జి.కె. రవిచంద్ర పాల్గొని ఆర్థిక సహకారాన్ని అందించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది.

ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం..

ఇందిరానగర్ బస్తీలో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 18: ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్, రాజీవ్ నగర్ బస్తీలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలని సూచించారు. బస్తీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని, నీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కాలనీలు, బస్తీల్లో అధికారులతో సర్వే చేయించి అవసరమైన కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబితాకిశోర్, అనిల్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదం అయినా తప్పదు వెళ్లాల్సిందే... అయితే ఇక్కడ మగవారు కాదనండోయ్..! మహిళలే.. ఓ పక్క ఉచిత బస్సు ప్రయాణం..మరోపక్క మొదలైన పాఠశాలలు, కాలేజీలు.. చాలీచాలని బస్సులు.. అయినా గమ్యం చేరాల్సిందే.. సరిపడా బస్సులు లేక ఉన్న కొద్దిపాటి బస్సుల్లో పుట్‌బోర్డు ప్రయాణం చేసుకుంటూ పోతున్న దృశ్యం మంగళవారం అమీర్‌పేట్ బస్‌స్టాఫ్‌లో కనిపించింది.

ఆలయం షట్టర్ అద్దెకివ్వొద్దు

కవాడిగూడ, జూన్ 18: దోమలగూడ హనుమాన్ ఆలయంలో ఉన్న ఖాళీ షట్టర్(మడిగె) ను వేలంపాట ద్వారా అద్దెకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయం ఎదుట భక్తులు ఆందోళన చేశారు. కమిటీ సభ్యులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈఓ దేవనాథానికి వినతి పత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కేఆర్‌కే ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, కే లక్ష్మీనారాయణ, వీడీ కృష్ణ, బి. శ్యామ్‌లాల్, జె. పరమేశ్వర్, గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్, ఎన్‌డీ సాయికృష్ణ మాట్లాడుతూ.. ఆలయంలో ఉన్న మడిగెను పూర్తిగా తొలగించి భక్తుల సౌకర్యార్థం గుడిని విశాలంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24 న ఖాళీగా ఉన్న మడిగెను అద్దెకు ఇస్తామని ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విషయమై దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేట్లు చూస్తానని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఈటీ సురేశ్ కుమార్, జి. వెంకటేశ్, సలంద్రి దిలీప్ యాదవ్, జంగా శ్రీనివాస్, కుమార్‌గౌడ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఈఓకు వినతిపత్రం ఇస్తున్న భక్తులు

ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగిఉండాలి

తెలుగు యూనివర్సిటీ, జూన్ 18 : ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరచుకొని సహాయాన్ని అందించి పేదలకు అండగా నిలవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. నాంపల్లి రెడ్‌హిల్స్ నఫీజ్‌రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో ఎల్‌పీడీఓ అధ్యక్షుడు భరత్ సంగం జన్మదినం సందర్భంగా అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులతో కూడిన కేవీఆర్ కిట్లను రమణాచారి దంపతులు పంపిణీ చేశారు. రమణాచారి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, సెట్విన్ మాజీ ఎండీ వైద్యనాథ్, కన్నారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కేవీఆర్ కిట్‌లను పంపిణీ చేస్తున్న రమణాచారి దంపతులు